ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 3 మే 2025 www.prajaswaramdaily.com 4 pm

# హరిరామ్ ఆస్తులపై ఆరా



**ఆదాయానికి మించిన ఆస్తుల కేసు**

**ఏసీబి కస్టడి కొనసాగింపు**

హైదరాబాద్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గజ్వేల్ ఈఎన్‌సి హరిరామ్ ఏసీబి కస్టడి కొనసాగుతోంది. ఇప్పటికే హరిరామ్ ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఐదు రోజుల పాటు కోర్టు అనుమతుల మేరకు హరిరామ్ ను చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ కస్టడిలోకి తీసుకుంది. ఏసీబీ ప్రధాన కార్యాలయంలో అక్రమ ఆస్తులపై ఆరా తీస్తోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 13 కోట్ల రూపాయల ఆస్తులను గుర్తించింది. బహిరంగ మార్కెట్ వీటి విలువ పదిరెట్లు. వంద కోట్లకు పైగా హరిరామ్ ఆస్తులను గుర్తించింది .

మంగళవారం వరకు ఆయన్ను విచారించనున్నది. కస్టడీలో భాగంగా లాకర్లు ఓపెన్ చేయనున్నది. చేస్తే ఆస్తుల విలువ పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు. ఇంత భారీ స్థాయిలో ఆస్తులు బెట్టడం వెనకాల ఉన్నది ఎవరు అన్న కోణంలోనూ విచారిస్తోంది. ఆయన ఇంట్లో సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల వివరాలు సేకరిస్తోంది. స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల పై ఉన్న పేర్లు, వారితో ఉన్న సంబంధాలు పై ఆరా తీస్తున్నారు. పలువురు బినామీలు ఉన్నట్లుగా గుర్తించారు. బ్యాంకు అకౌంట్లు, డాక్యుమెంట్ల, బినామీలతో ఉన్న ఆస్తులు వివరాలను రాబట్టనున్నారు.

# ఉగ్రవాదం మానవాళికి పెను ముప్పు

**ప్రధాని మోదీ**

**అంగోలా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు**

**సమావేశంలో పహల్గాం దాడి ప్రస్తావన**

**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలకు కట్టుబడి ఉన్నాం**

**భారత్ పోరాటానికి అంగోలా మద్దతుకు కృతజ్ఞతలు పీఎం**



ఢిల్లీ : ఉగ్రవాదం, దానికి మద్దతునిస్తున్న శక్తులపై అత్యంత కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి భారత్ సంపూర్ణంగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి పెను ముప్పు అని అభివర్ణించారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు.

పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా ప్రభుత్వం మద్దతు ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

"ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు. దీనిని ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఉగ్రవాదులు, వారికి అండగా నిలిచే వారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకునేందుకు మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.


భారత్, అంగోలా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

# సీఎం.. 42సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేంటి?: హరీశ్‌రావు

**కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటా సగానికిపైగా తగ్గింది**

**ఢిల్లీకి వెళ్లినా ప్రయోజనం నిల్**

**ఈ విషయమై రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపాటు**



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటాను సగానికిపైగా తగ్గించిందని, ముఖ్యమంత్రి 42 సార్లు ఢిల్లీకి వెళ్లి చేసిందేంటి అని హరీశ్‌రావు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విమర్శించారు. "2024-25లో తెలంగాణకు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పనిదినాలను 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు కేంద్ర ప్రభుత్వం సగానికి తగ్గించింది. ముఖ్యమంత్రి ఢిల్లీకి 42 సార్లు వెళ్లినా ఉపాధి హామీ పనిదినాలు సగానికి తగ్గాయి. విషయం తెలిసినా రాష్ట్రంలోని 8 మంది కాంగ్రెస్ ఎంపీలతో పాటు 8 మంది బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనిదినాలను పెంచాలని, బకాయిలను చెల్లించాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## సింధూ జలాలను మళ్లించే

# ఏ నిర్మాణమైనా పేల్చేస్తాం

**: పాక్ మంత్రి ఖ్వాజా ఆసిఫ్**

**ఈ ఒప్పందం నిలిపివేతపై ఇప్పటికి పాక్ నేతలు అనుచిత వ్యాఖ్యలు**

**వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూసే అవకాశం ఉంటుందన్న నిపుణులు**



ఇస్లామాబాద్ : సింధూ జలాలను మళ్లించేందుకు భారత్ ఏ నిర్మాణం చేపట్టినా ధ్వంసం చేస్తామంటూ అవాకులు చవాకులు పేలారు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ . ఈ మేరకు ఓ మీడియా సంస్థతో మాట్లాడారు. ఈ ఒప్పందం నిలిపివేతపై పాక్ నేతలు పలుమార్లు భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ భిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్న సంగతి తెలిసిందే. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ మాట్లాడారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ఇరు దేశాల మధ్య వైషమ్యాలు తారస్థాయికి చేరిన సందర్భాలనేకం. అయితే ఇందుకు ప్రతిగా నదీ జలాల ఒప్పందాన్ని పక్కన పెట్టడం ఇదే ప్రథమం. పాకిస్థాన్ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై ఇది తీవ్ర ప్రభావం చూపనుందని, దీర్ఘకాలిక ప్రభావం పడనుందని నిపుణులు అంటున్నారు.

## కేంద్ర కులగణన ప్రకటన..

# మా విజయమే

**ఎట్టకేలకు తమదారిలోకి రావడం సంతోషకర పరిణామం**

**బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉండాలి**

**డిప్యూటీ సీఎం భట్టి**



ఖమ్మం : కేంద్రం కులగణన ప్రకటన ముమ్మాటికీ తెలంగాణ సర్కార్ విజయమేనని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఆయన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మల్లన్నపాలెంలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియా మాట్లాడుతూ తెలంగాణలో కులగణన చేసి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచామని అన్నారు. ప్రభుత్వం నిర్ణయాల్లో కులగణనను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కులగణన సర్వే ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలునిచ్చారు.

అదేవిధంగా ప్రభుత్వానికి బీసీలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు తొలగించడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో తాము నిర్వహించిన కులగణనను ఇన్నాళ్లు అపహాస్యం చేసిన బీజేపీ ఇప్పుడు తమ దారిలోకి రావడం సంతోషకర పరిణామమని అన్నారు.

# భర్తపై దాడిచేసి.. భార్యను వెంబడించి..

**ఫోన్ ఇవ్వాలని వేధింపులు**

**నోటికొచ్చిన అసభ్యపదజాలంతో రెచ్చిపోయిన ముగ్గురు**

**100 డయల్ తో ఘటనా స్థలానికి పోలీసులు**

**పోకిరీలను అదుపులో తీసుకున్న వైనం**

ఎస్ఆర్‌నగర్ : కొందరు కామాంధులు భర్త కళ్లెదుటే భర్యను వేధించారు. కాసేపు నన్నే నీ భర్త అనుకో.. నీ ఫోన్ నంబర్ ఇవ్వు అంటూ దారికి అడ్డంగా నిలబడి బీరు బాటిళ్లతో హంగామా చేసి బెదిరించారు. నోటికొచ్చిన అసభ్యకర మాటలతో రెచ్చిపోయారు. భర్తపై దాడి చేశారు. హైదరాబాద్ మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది.

బాధిత వివాహిత తన భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి గతరాత్రి బేగంపేటలోని ఒక పబ్ కి వెళ్లి 11.30 గంటలకు తిరిగి వస్తుండగా ఎస్సార్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద భర్తపై ముగ్గురు యువకులు దాడి చేసి.. వివాహితను వెంబడించడంతో తప్పించుకుని 100కు డయల్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ముగ్గురు యువకులు డి.సంపత్ (28), సందీప్ (28), కూకట్ పల్లికి చెందిన ఉమేష్ (28)లను అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# సముద్ర రవాణా మార్గాలు మూసివేత

**పాక్ ను అష్టదిగ్బంధనం చేసేందుకు చర్యలు**

**ఇప్పటికే పలు కఠినమైన ఆంక్షలు**

**పాక్ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా చర్యలు**



ముంబయి : పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రోద్బలం ఉందని గట్టిగా నమ్ముతున్న భారత్... దాయాది దేశాన్ని అష్టదిగ్బంధనం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటోంది. పలు కఠిన ఆంక్షలతో పాక్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న భారత కేంద్ర ప్రభుత్వం... తాజాగా సముద్ర రవాణా మార్గాల వైపు దృష్టిసారించింది. పాకిస్థాన్ తో సముద్ర రవాణా మార్గాలను మూసివేసింది. మర్చంట్ షిప్పింగ్ యాక్ట్-1958లోని సెక్షన్-411 ప్రకారం కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో, పాకిస్థాన్ జెండా కలిగిన నౌకలు భారత పోర్టుల్లోకి ప్రవేశించడంపై నిషేధం అమల్లోకి వస్తుంది. భారత జెండా కలిగిన నౌకలు కూడా పాకిస్థాన్ పోర్టుల్లోకి వెళ్లడంపై నిషేధం ఉంటుంది. తాజా చర్య ద్వారా పాకిస్థాన్ తో భారత్ అన్ని రకాల సంబంధాలు తెంచుకుంటున్నట్టు అర్థమవుతోంది. ఇప్పటికే భారత్ గగనతలం మూసివేసింది. వాణిజ్యపరమైన అంశాల్లో కూడా నిషేధం ప్రకటించింది. తాజాగా సముద్ర రవాణా మార్గాలను మూసివేస్తూ.. కీలక నిర్ణయం తీసుకుంది.